బీజేపీది కక్ష సాధింపు చర్య

- అరెస్ట్ వెనుక బడే భాయ్.. చోటా భాయ్..
- కవిత అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నాం..
- కేసీఆర్ కుటుంబానికి ఇది కొత్తేమీ కాదు..
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర
- అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా, రాస్తారోకో

ధర్నా కార్యక్రమానికి వస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

భూపాలపల్లి రూరల్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికల వేళ బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తాము ఖండిస్తున్నామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం అధిష్టానం పిలుపు మేరకు ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్ట్‌కు నిరసనగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలతో కలిసి ఆయన ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు వస్తే మోదీ వస్తారని, ఆయనకు ముందు ఈడీ వస్తుందని అన్నారు. అరెస్ట్‌లు, బెదిరింపులు బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్ కుటుంబానికి కొత్తేమీ కాదని అన్నారు. కవిత అరెస్ట్ వెనుక బడే భాయ్, చోటా భాయ్ హస్తం ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు నీళ్ల లేక అవస్థలు పడుతుంటే, ఇవేమీ పట్టించుకోకుండా మహిళలపై రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కేసీఆర్‌ను ఎదుర్కోలేక రెండు జాతీయ పార్టీలు కలిసి ఒక ఆడబిడ్డ మీద కక్ష సాధిస్తున్నాయని, అధికార పార్టీ కనుసన్నల్లో పోలీస్ శాఖ పనిచేస్తున్నదని, రాష్ట్రంలో చాలా చోట్ల బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని అన్నారు. పోలీస్ శాఖ రాజ్యాంగానికి లోబడి చర్యలు చేపట్టాలే కాని, అధికార పార్టీ నేతల ఆదేశాలతో కాదని హితవు పలికారు. ధర్నా అనంతరం పోలీస్ అధికారులు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య అన్నారు. అరెస్టుకు నిరసనగా శనివారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. రోడ్డుపై బైఠాయించడంతో పలు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ వేయి మంది మోదీలు, రేవంత్‌లు వచ్చినా భయపడేది లేదన్నారు. ఎలాంటి మచ్చలేకుండా ఎమ్మెల్సీ కవిత బయటకు వస్తుందనే నమ్మకం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీజేపీ, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డిని అరెస్ట్ చేసి తీసుకుపోతున్న పోలీసులు

చిట్యాల : రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

కవిత అరెస్టు అప్రజాస్వామికం

సౌజన్యరెడ్డి

కాటారం, మార్చి 16 : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అప్రజాస్వామికమని ఆ పార్టీ కాటారం మండల మహిళా అధ్యక్షురాలు రత్న సౌజన్యరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలను అణచివేసేందుకు ఐటీ, ఈడీ, సీబీఐ లాంటి ప్రభుత్వ సంస్థలను మోదీ ప్రభుత్వం వాడుకోవడం హేయమైన చర్య అన్నారు. అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటై తెలంగాణలో బీఆర్ఎస్‌ను అణచివేసేందుకు ఎత్తుగడలు వేస్తున్నాయని ఆరోపించారు. విచారణ పేరుతో సోదాలు నిర్వహించి పక్కా పథకం ప్రకారమే అరెస్టు చేశారని, తగిన మూల్యం చెల్లించుకునే రోజు వస్తుందని సౌజన్య పేర్కొన్నారు.

ములుగు రూరల్ : ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కార్యక్రమంలో యూత్ మండలాధ్యక్షుడు తౌటం నవీన్, ప్రధానకార్యదర్శి ఏరుకొండ రాజేందర్, మండల ఉపాధ్యక్షుడు గుర్రపు తిరుపతి గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్, ఎంపీటీసీ తిరుపతి, చిట్యాల టౌన్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీధర్‌గౌడ్, దామెర రాజు, చిలుముల రమణాచారి, శంకర్రావు, దొడ్డ శంకర్, శ్రీదేవి, కట్కూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ములుగులో..

ములుగురూరల్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన పద్ద జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ అక్రమ అరెస్టుకు పాల్పడ్డాయన్నారు. ఈడీ అధికారులు విచారణ సమయంలో అదుపులోకి తీసుకోమంటూ కోర్టుకు హామీ ఇచ్చి, ఇప్పుడు ఎన్నికల సందర్భంలో అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, నాయకులు ఆకుతోట చంద్రమౌళి, గండి కుమార్, దూడ బోయిన శ్రీనివాస్, మహేందర్, అనుములు సురేశ్, సురేందర్, వెంకట్‌రెడ్డి, రాందాస్, నాజర్‌ఖాన్, సురేశ్ రెడ్డి, గరిగె రఘు, మాసిపెద్ది దేవేందర్‌రావు పాల్గొన్నారు.

కల్లంలో ఆరబెట్టిన మిర్చి తడవకుండా కప్పిన టార్పాలిన్

కన్నాయిగూడెంలో అకాల వర్షం

కన్నాయిగూడెం, మార్చి 16 : మండలకేంద్రంతోపాటు ముప్పనపల్లి, చిట్యాల, భూపతిపూర్ గ్రామాల్లో శనివారం తేలికపాటి వర్షం కురిసింది. మిర్చిని కల్లంలో ఆర బెట్టిన కొందరు రైతులు టార్పాలిన్లు కప్పి తడవకుండా కాపాడుకున్నారు. ఇంకా మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో రైతులు టార్పాలిన్లను సిద్ధంగా ఉంచారు.

ఐదుగురు వ్యక్తుల రిమాండ్

గోవిందరావుపేట, మార్చి16 : వన్య ప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు అమర్చి ఒకరి మృతికి కారకులైన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్పీ సీఐ శంకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దుంపిల్లగూడేనికి చెందిన పిండి రమేశ్ గత నెల 12న మేకలు తప్పిపోయాయని వెళ్తున్న క్రమంలో విద్యుత్ తీగలు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ శంకర్ ఆదేశాల మేరకు పోలీసులు దర్యాప్తు చేసి బాధ్యులను గుర్తించారు. అదే గ్రామానికి చెందిన ఎర్రబోయిన అశోక్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, నద్దునూరి కోటయ్య, నద్దునూరి సందీప్, ఆజ్మీరా స్వామిని నిందితులుగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మంగపేట/ ఏటూరునాగారం, మార్చి 16 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం ఆయా మండలాల తహసీల్దార్లు వీరస్వామి, జగదీశ్వర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంగపేటలో 145 మందికి, ఏటూరునాగారంలో 19 మందికి చెక్కులు అందజేశారు. కార్యక్రమాల్లో మంగపేట డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు శ్రీనివాస్, ఏసుపాదం, నర్సింహమూర్తి, కిరణ్, వీఆర్ఏ శంకర్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

టేకుమట్ల, మార్చి 16 : మండలంలోని బండపల్లికి చెందిన బండ నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డిల తల్లి సూర్యలక్ష్మి ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆమె కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అయన వెంట ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రవి, నేరెళ్ల రామకృష్ణ, తిరుపతి, శ్రీను, లింగారెడ్డి, మహేశ్ తదితరులున్నారు.

వేసవిలో రైతులు జాగ్రత్తలు పాటించాలి

భూపాలపల్లి రూరల్, మార్చి 16 : వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో ఉద్యాన పంటల్లో దిగుబడి తగ్గకుండా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి డీ సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేల స్వభావం, పంటల కాలాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలని, తేమ ఎక్కువ కాలం ఉండేందుకు మల్చింగ్ చేసి డ్రిప్ ద్వారా నీరందించాలన్నారు. కూరగాయల పంటకు బిందు సేద్యం ద్వారా తడి పెట్టాలని, వడ గాల్పుల నుంచి పంటలను కాపాడుకోవడానికి బార్డర్ పంటలను రెండు, మూడు వరుసలు వేసుకోవాలన్నారు. టమాట, ఆకు కూరలు, పచ్చి మిర్చి పంటలపై 50 శాతం షేడ్ నెట్ వాడాలని ఆయన సూచించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఏటూరునాగారం, మార్చి 16 : వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో రమాదేవి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం తాగునీటి వసతిపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకాధికారులతో సమన్వయం చేసుకుని నీటి సమస్యల తలెత్తకుండా చూడాలన్నారు. చేతి పంపులు, బోరు బావులు, మిషన్ భగీరథ తదితర అంశాలపై మాట్లాడారు. మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని ఆదేశించారు. ఏటూరునాగారం మేజర్ పంచాయతీలో నీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శి రమాదేవికి సూచించారు. లీకేజీల మరమ్మతులు చేస్తున్నట్లు ఆమె బదులిచ్చారు.

విద్యుత్ లైన్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

గణపురం, మార్చి 16 : మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధి కుందయ్యపల్లిలో జనావాసాల మధ్య నుంచి 11 కేవీ లైన్ వేసేందుకు శనివారం విద్యుత్ అధికారులు మరోసారి యత్నించారు. ఈ నేపథ్యంలో గుంతలు తవ్వడానికి వచ్చిన ట్రాక్టర్‌ను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తాము గతంలో గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశామన్నారు. అయినప్పటికీ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఎన్నో ఏళ్లుగా ఉన్న లైన్‌ను తొలగించి తమ కాలనీలో నుంచి వేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి 11 కేవీ లైన్ వేయకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

గణపురం, మార్చి 16 : పోలింగ్ కేంద్రాల్లో గడువులోగా వసతులు కల్పించాలని భూపాలపల్లి ఆర్డీవో మంగీలాల్ అధికారులను ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు, ఫర్నిచర్, తాగునీరు, ర్యాంపుల నిర్మాణం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ప్రతి బూత్ వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పనులు ప్రారంభిస్తున్న అధికారులు

గణపురం, మార్చి 16 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ అభివృద్ధికి నిధులు మంజూరు కాగా శనివారం జడ్పీ సీఈవో విజయలక్ష్మి, ఎంపీపీ కావటి రజితా రవీందర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయంలో సీసీ రోడ్డు, వైరింగ్, ఫర్నీచర్ కోసం రూ. 40.50 లక్షలు మంజూరైనట్లు సీఈవో తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, వైస్ ఎంపీపీ అశోక్, కో ఆప్షన్ సభ్యుడు చోటేమియా, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన

వెంకటాపూర్, మార్చి 16 : మండలంలోని రామంజాపూర్‌లో శనివారం వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) కే శ్రీపాల్, ఏవో కల్యాణితో కలిసి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైర్లు దుబ్బు చేసే దశ నుంచి చిరు పొట్ట దశలో ఉన్నాయని, కాండం తొలిచే పురుగు ఉధృతి ఉందన్నారు. నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్, లేదా క్లోరాంట్రానిలిప్రోల్ మందులు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. నత్రజని అధికంగా వాడడం వల్ల అగ్గితెగులు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కావ్య, రైతులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌కు ఎంపికైన మహోన్నత్

భూపాలపల్లి రూరల్, మార్చి 16 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (రామాంతపూర్)లో ఒకటవ తరగతిలో ప్రవేశానికి మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మహోన్నత్ ఎంపికైనట్లు భూపాలపల్లి ఎస్సీ అభివృద్ధి అధికారి డీ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం శనివారం జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించామని, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారని ఆమె పేర్కొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభించిన ఎంపీడీవో

మహదేవపూర్, మార్చి 16 : మండలంలోని ఎన్కపల్లి గ్రామంలో నూతన బోర్‌వెల్ పనులను శనివారం ఎంపీడీవో ప్రసాద్ ప్రారంభించారు. వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూసేందుకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 2 లక్షలతో పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుడాల అరుణ, జీపీ కార్యదర్శి సతీశ్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి
- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, మార్చి 16 : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని భూపాలపల్లి ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల నోడల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. జిల్లాలో అవసరమైన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, ఉల్లంఘనలపై 1950 టోల్ ఫ్రీ నంబర్, సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించారు. సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ములుగు అభివృద్ధే ధ్యేయం

- పీఆర్ శాఖ ద్వారా రూ.182 కోట్ల పనులు
- మంత్రి ధనసరి అనసూయ
- పలు మండలాల్లో పనులకు శంకుస్థాపనలు

కాసిందేవిపేటలో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగురూరల్/ ఏటూరునాగారం/ గోవిందరావుపేట/ తాడ్వాయి/ వెంకటాపూర్, మార్చి16 : ములుగు నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉండేలా కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం మంత్రి ములుగు, ఏటూరునాగారం, గోవిందరావుపేట, తాడ్వాయి, వెంకటాపూర్ మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ములుగు మండలం జగ్గన్నపేట పుట్టమల్లన్న ఆలయం, పాఠశాల ప్రహరీలు, చిన్నగూటూరుపల్లిలో సీసీ రోడ్లు, బోరు మోటరు పనులను ప్రారంభించారు. కాసిందేవిపేటలో సీసీ రోడ్డు, యాదవ సంఘం కమ్యూనిటీ హాల్, రామాలయ నిర్మాణానికి ప్రహరీ, జంగాలపల్లిలో సీసీ రోడ్లు, మసీదు ప్రహరీ, మహిళా కమ్యూనిటీ హాల్, ఇంచర్లలో సీసీ రోడ్డు పనులు, అంగన్‌వాడీ భవన నిర్మాణ మరమ్మతు పనులను ప్రారంభించారు. గ్రామానికి చెందిన జర్నలిస్టు కుంచం రమేశ్‌కు మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంత్రి ఆయన ఇంటికి వెళ్లి అందజేశారు. జిల్లా కేంద్రంలో మహిళా, హమాలీ కమ్యూనిటీ హాల్స్, వడ్డెర వాడలో హనుమాన్ గుడి ప్రహరీ, కలెక్టరేట్‌లో మహిళలకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేశారు. పోషణ అభియాన్‌లో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన జరిపించారు. మంచినీటి నాణ్యతను పరీక్షించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా సరఫరా అయిన క్లోరోస్కోప్ కిట్లను మంత్రి కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్ కన్సల్టెంట్ ప్రవీణ్ నీటి నాణ్యత పరీక్షలను క్లోరో స్కోప్ ద్వారా ఏ విధంగా చేయాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఏటూరునాగారం మండలం దొడ్ల- కొండాయి మధ్యలోని జంపన్నవాగుపై రూ.9.5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. చిన్న బోయినపల్లిలో దూపాటి సతీశ్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని మంత్రి ప్రారంభించారు. గ్రామంలో ప్రహరీ పనులకు శంకుస్థాపన చేశారు. గోవిందరావుపేట మండలం మచ్చాపూర్‌లో సీసీ రోడ్డు పనులు, చల్వాయి ప్రభుత్వ పాఠశాల ప్రహరీ, గోసంగి సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. మండలకేంద్రంలో పద్మశాలి కమ్యూనిటీ హాల్, పస్రాలో సీసీ రోడ్డు, దేవాలయ ప్రహరీ పనులను ప్రారంభించారు. తాడ్వాయి మండలకేంద్రంలోని విశ్రాంతి భవనంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారు అందించిన 50 సోలార్ లైట్లను గొత్తికోయలకు మంత్రి అందజేశారు. వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట – భూర్గుపేట గ్రామాల మధ్య ఉన్న బోదర వాగుపై రూ.1.15 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. లక్ష్మీదేవిపేట రూ.15 లక్షలతో నిర్మించిన మదీనా మజీద్, మదస్సాను ప్రారంభించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.182కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ. 6 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో మంచి నీటి వనరులు పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి రూ.150 కోట్లు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గం మొత్తంలో సీసీ రోడ్ల నిర్మాణంలో భాగంగా రూ.15కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఎస్పీ డాక్టర్ శబరీశ్, అడిషనల్ కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఏటూరునాగారం ఏఎస్పీ గితే మహేశ్ బాబాసాహెబ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, డీఎస్పీ రవీందర్, ఎంపీపీలు గండ్రకోట శ్రీదేవి, బుర్ర రజిత, హెచ్‌డీఎఫ్‌సీ సర్కిల్ అధికారి విశాల్ భాటియా, ములుగు బ్రాంచ్ మేనేజర్ సురేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాస్‌రావు, ఎస్ఈ మల్లేశ్, ఈఈ సుభాష్, డీఈ అజార్, ఏఈ లు ప్రవీణ్, నవీన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, చిటమట రఘు, దేవేందర్, వావిలాల ఎల్లయ్య, మత గురువులు మహ్మద్ సాధిక్, సయ్యద్ ఖాసీం, మహ్మద్ మక్బూల్ పాషా, సర్పరాజ్, హుస్సేన్ పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న బాల్య వివాహాలు

తాడ్వాయి, మార్చి16 : బాల్య వివాహాలు, అక్రమ దత్తతలు చిన్నారుల హక్కులను కాలరాస్తున్నాయని ఐసీడీఎస్ సీడీపీవో మల్లీశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాలు జరిపిస్తున్న తల్లిదండ్రులు, సహకరించిన వారిపై కేసులు నమోదు చేయించాలని మల్లీశ్వరి సూచించారు.

జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సోషల్ వర్కర్ జ్యోతి మాట్లాడుతూ బాల్య వివాహాలు, అక్రమ దత్తతల నిరోధానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ రజిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయ, అనంతలక్ష్మి, కళావతి, శారద, పోషణ అభియాన్ శ్రావణి, శిరీష, తాడ్వాయి ప్రాజెక్ట్ అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రేగొండ : పోషణ పక్వాడాలో పాల్గొన్న నాగేశ్వర్‌రావు

రేగొండ/ భూపాలపల్లి రూరల్/ ఏటూరునాగారం/ వెంకటాపూర్, మార్చి 16 : పౌష్టికాహారాన్ని తీసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని భూపాలపల్లి జిల్లా సంక్షేమ శాఖాధికారి నాగేశ్వర్‌రావు, సీడీపీవో అవంతి, ములుగు ములుగు జిల్లా సీడీపీవోలు హేమలత, స్వాతి అన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమాల్లో శనివారం ఆయా మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, బాలింతలు, గర్భిణులు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అలాగే ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సంధ్య, సునీత, నేరేడుపల్లి పంచాయతీ కార్యదర్శి నరేశ్, అంగన్‌వాడీ టీచర్లు విమల, ఉమామహేశ్వరి, సుజాత, సునీత, దేవేంద్ర, రజిత, జ్యోతిలక్ష్మి, కవిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం, ఏటూరునాగారం శివాలయం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు విజయ, స్వరూపారాణి, భాగ్య, రాజేశ్వరి, శ్రీలత, తరంగిణి, సోమలక్ష్మి పాల్గొన్నారు. వెంకటాపూర్ మండలకేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సీసీఐ రాణి, సీహెచ్ఎల్‌సీవో నరేశ్, సీహెచ్ఎల్‌సీడబ్ల్యూ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, రజిత, షాహీన్ సుల్తానా, ఫరీదా పాల్గొన్నారు.

లోక్ అదాలత్ తీర్పే అంతిమం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ లలితశివజ్యోతి

మాట్లాడుతున్న జడ్జి లలిత శివజ్యోతి

ములుగురూరల్, మార్చి16 : లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను రాజీ కుదుర్చుకుంటే ఇచ్చే తీర్పే అంతిమం అని పైకోర్టుల్లో అప్పీల్ ఉండదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ములుగు కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.వి.పి లలిత శివజ్యోతి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు ఆవరణలో నాలుగు బెంచీలను ఏర్పాటు చేసి మొత్తం 200 కేసులను పరిష్కరించారు. ఇందులో మూడు ఎంవీఐపీ కేసులను పరిష్కరించి రూ.4,27,000 కక్షిదారులకు ఇప్పించారు. అలాగే 170 కాంపౌండబుల్ క్రిమినల్ కేసులను పరిష్కరించారు. ఒక ప్రీ లిటిగేషన్ కేసును పరిష్కరించారు. 26 బీఎస్ఎన్ఎల్, బ్యాంకు రికవరీ కేసులను పరి